ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

ఆదివారం | 27 ఏప్రిల్, 2025 | పేజీలు : 06

# పకడ్బందీగా నీట్ పరీక్ష నిర్వహించాలి




**ప్రజాపక్షం/సిద్ధిపేట ప్రతినిధి:** నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించే చర్యలు తీసుకోవాలని కేంద్ర విద్యశాఖ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారులు సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్‌తో న్యూడిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మే 4వ తేదీ న నిర్వహించన్ను యూజిసి నీట్ పరీక్ష పగడ్బందీ నిర్వహణపై తగు సలహాలు సూచనలు జారీ చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేసి, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తుతో పరీక్ష నిర్వహించాలని సూచించారు. వీడియో కాన్ఫెరెన్స్‌లో పాల్గొన కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ...జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలను అన్ని విధాలుగా సిద్ధం చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అధికారులు ఉన్నారు.

# అర్హులను మాత్రమే ఎంపిక చేయాలి

## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ప్రజాపక్షం/ఖానాపూర్:** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను అర్హులను మాత్రమే ఎంపిక చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. శనివారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే తీరును ఖానాపురం మండల కేంద్రంలో క్షేత్రస్థాయిలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీలు, అధికారులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పక్కాగా అర్హులకు అందేలా చూడాలన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు ప్రభుత్వం కేటాయించడం జరిగిందన్నారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి అనుమతుల కోసం ప్రభుత్వానికి పంపాలని, మంజూరు జాబితా వచ్చిన తర్వాత ఇండ్ల నిర్మాణం ప్రారంభించుకోవచ్చునన్నారు. జిల్లాలో 1500 ఇండ్లు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అందులో బెస్‌మెంట్ లెవల్ పూర్తయిన 49 మంది లబ్ధిదారులకు మొదటి విడత బిల్లుల రూ. లక్ష చెల్లించడం జరిగిందన్నారు. ఇంటి నిర్మాణానికి ఆర్థికంగా వెసులుబాటు కోసం సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల నుండి లక్ష రూపాయలు రుణం పొందవచ్చునన్నారు. బెస్‌మెంట్ లెవెల్ బిల్లు రాగానే తిరిగి అప్పు చెల్లించవచ్చునని తెలిపారు. అనంతరం ఖానాపురం మండల కేంద్రంలోని పాత గ్రామ పంచాయతీ భవనంలోని అంగన్‌వాడీ కేంద్రం 5ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారం సరైన మోతాదులో ఇస్తున్నారా పాలు, గుడ్లు ఉన్నాయా వంటి వివరాలను తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖానాపురం తహసీల్దారు కిరణ్ కుమార్, ఎంపిడిఓ సునిల్ కుమార్, ఇంజనీరింగ్ అధికారులు, డిడబ్ల్యూఓ అధికారి, రెవెన్యూ అధికారులు స్వామి, బైరబోయిన ఐలేష్, అర్కాల స్వామి, మాచర్ల గోవర్ధన్, రవీందర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



# పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** స్టేషన్‌ఘనపూర్ మండలంలోని శివునిపల్లి గ్రామ పంచాయితి కార్యదర్శి టి శ్రీకాంత్‌ను సస్పెండ్‌చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయితి నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ కె ఉమారాణి డీపీవోకు ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో డీపీవో విచారణ జరిపి దాదాపు రూ.18లక్షల 79వేలు గ్రామ పంచాయితి నిధులు తన సొంత ఖాతాకు మళ్లించడం, పన్నులు, పన్నేతర వసూళ్లు దాదాపు రూ.10లక్షలలో కేవలం రూ.54వేలు మాత్రమే గ్రామ పంచాయితి ఖాతాలో జమచేయడం, ఇతర బిల్లులు సరిగ్గా నిర్వహించలేదని నివేధికను డీపీవో కలెక్టర్‌కు నివేధిక సమర్పించగా కలెక్టర్ ఆయనను సస్పెండ్ చేయడం జరిగింది.

## భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే

# భూభారతి చట్టం

## కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/మల్హర్:** భూ సమస్యలు శాశ్వత పరిష్కారానికి భూభారతి చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని,ఏళ్ల తరబడి రైతులు ఎదుర్కొంటున్న అనేక భూ సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభిస్తుందని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. శనివారం మల్హర్ మండలం లోని కొయ్యూరు రైతు వేదికలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతుల ఇబ్బందులు తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో కొత్త ఆర్‌వోఆర్ చట్టం 2025, భూ భారతి పోర్టల్ అమలులోకి తీసుకువచ్చింది అని ఈ చట్టం తో రైతులకు భూ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని, గతంలో ధరణి లో ప్రతి సమస్యకి సిసిఎల్‌ఏ లో మాత్రమే పరిష్కారం అయ్యేది, కానీ భూ భారతి లో తహసీల్దార్ స్థాయి నుండి కలెక్టర్ స్థాయి వరకు వివిధ దశలలో సమస్య లు పరిష్కరించే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా భూ భారతి అమలు చేసి సమస్యలకు పరిష్కరిస్తుంది అని, మే మొదటి వారం లో జిల్లాకు ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి భూ సమస్యలు పరిష్కరిస్తామని, జూన్ రెండవ తేది నుండి భూ భారతి పోర్టల్ పూర్తి స్థాయిలో అమలులోకి వస్తుంది అని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భూ సమస్యలను పరిష్కరించు కోవాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో అడిష్నల్ కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, తహసీల్దార్ రవి కుమార్, పిఎసిఎస్ చైర్మెన్ ఇప్ప మొండయ్య, ఏవో శ్రీజ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ రాజశేఖర్, మాజీ ఎంపీపీ మల్హల్ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి, రమేష్, రైతులు పాల్గొన్నారు.




# రైల్ నీరు మాటున కోట్ల రూపాయలు దోచేస్తున్నారు




**ప్రజాపక్షం/నెక్కొండ:** దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో రైల్వే శాఖ ప్రయాణికుల కోసం రైల్ నీరు అని వాటర్ బాటిల్స్ 15 రూపాయలకు పంపిణీ చేయాలనే సంకల్పంతో సంబంధిత డిస్ట్రిబ్యూటర్లకు సరఫరా చేశారు. డిస్ట్రిబ్యూటర్ల నుండి కొనుగోలు చేసిన రైల్వే స్టేషన్ రైళ్లలో అమ్మే వ్యాపారులు 20 రూపాయల చొప్పున అమ్ముచు అదనంగా ఐదు రూపాయలు చొప్పున దోచేస్తున్నారు. అడిగితే నిర్లక్ష్యంగా అంతే అంటున్నారు. ఇతర కంపెనీల బాటిల్ 20 అమ్ముతున్నారు. కేంద్ర ప్రభుత్వం (రైల్వే శాఖ) ప్రజల కోసం 15 రూపాయలకే బాటిల్ ఇవ్వాలని బాటిల్ పై 15 రూపాయలు ప్రింట్ చేశారు. అయినా అమ్మకం దారులు 20 రూపాయలకు అమ్ముతున్నారు. వాస్తవానికి 9 నుండి 11 రూపాయలకు వారు ప్రధాన డీలర్ల వద్ద కొనుగోలు చేస్తారు. ఇది ఇలా ఉండగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, రాష్ట్రాలలో కూలింగ్ లేకుండానే 20 అమ్ముతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం కూలింగ్ చేసి 20 రూపాయలకు అమ్ముతున్నారు. ఏది ఏమైనా దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్లలో రైళ్లలో రోజుకు ఈ వేసవిలో రమారామి 50 లక్షల బాటిలు అమ్ముతున్నట్టు ప్రచారం. ఒక్కో బాటిలకు ఐదు రూపాయల చొప్పున 50 లక్షల బాటిళ్లకు కోట్ల రూపాయలు ప్రజల సొమ్ము అప్పనంగా దోచేస్తున్నారు. దీనికి తొడు వాళ్లు రైళ్లలో స్లీపర్ పారడైసి సెకండియర్ లీ ప్రయాణికులు కావలసిన ఫుడ్డు కోసం ఆర్డర్ ఇవ్వొచ్చని అదే బాటిలపై వారి ఫోన్ నెంబర్ తో సహా ఇస్తూ ప్రచారం చేసుకుంటున్నారు. ఇలా రైల్ నిల్ లో ఇంత తతంగం రైల్వే ఉన్నతాధికారులు చూసి చూడనట్టు వదిలేయడంతోనే ఈ స్కామ్ జరుగుతున్నట్టు కొందరు పదవి విరమణ పొందిన, సీనియర్ రైల్వే కాంట్రాక్టర్లు, అధికారులు చెబుతున్నారు. రైల్వే శాఖ ఉన్నతాధికారులు, కేంద్ర ప్రభుత్వం, ఈ అవినీతి సంపాదనపరుల ఆట కట్టించగలిగితెనె లేనియెడల ప్రజావ్యతిరేకతను చవిచూడాల్సిన పరిస్థితి పొంచి ఉంది.



# చార్జ్‌షీట్లను నిర్ధేశిత కాలవ్యవధిలో న్యాయ స్థానాలకు సమర్పించాలి





**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** చార్జ్‌షీట్లను నిర్ధేశిత కాల వ్యవధిలో న్యాయ స్థానాలకు సమర్పించాలని ములుగు ఎస్‌పి డాక్టర్ శబరీష్ అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం కోర్టు డ్యూటీ, కోర్ట్ లైజనింగ్ అధికారులతో ములుగు జిల్లా ఎస్‌పి డాక్టర్ శబరీష్ ఐపిఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్‌పి మాట్లాడుతూ న్యాయ సంబంధిత విధుల్లో నిర్లక్ష్యం అంగీకరించదగినది కాదని, ప్రతి కేసు విచారణలో చార్జ్‌షీట్లను నిర్ధేశిత కాల వ్యవధిలో న్యాయ స్థానాలకు సమర్పించాల్సిన అవసరం ఉందని అధికారులను ఆదేశించారు. అలాగే కోర్టు విచారణకు సంబంధించి సాక్షుల హాజరును నిర్ధారించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిందిగా స్పష్టం చేశారు. ప్రతి కేసులో సాక్షులకు విధిగా సమన్లు అందజేసి కోర్టుకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లతో సమన్వయాన్ని మెరుగుపరిచి కేసుల పరిష్కార వేగాన్ని పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. న్యాయ స్థానాల్లో పోలీస్ వ్యవస్థపై విశ్వాసం నిలబెట్టాలంటే ప్రతి అధికారి తన విధులను నిబద్దతతో సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. వారంట్లను అమలు చేసి అనుమానితులను నేరస్థులను కోర్టుకు హాజరుపరచే సమయంలో వారిని సురక్షితంగా, సమయానికి న్యాయ స్థానాలకు తరలించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఎలాంటి భద్రతా లోపాలు తలెత్తకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కోర్టు డ్యూటీలలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠినంగా వ్యవహరించబడుతుందని హెచ్చరించారు. కోర్టు డ్యూటీల నిర్వహణలో పటిష్టత తీసుకురావాలని, బాధితులకు న్యాయం జరిగేలాగా చేయడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి డిఎస్‌పి కిషోర్ కుమార్, డిసిఆర్‌బి ఎస్‌ఐలు జగదీష్, ఐటి సెల్ సిబ్బంది రాజేంద్ర ప్రసాద్, సంధ్య, కోర్టుల లైసన్ అధికారులు, కోర్టు డ్యూటీ, ట్రైన్ ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## మత్స్యకారుల హక్కులకు ఐక్యంగా ఉద్యమించాలి



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మత్స్యకారుల హక్కులకై ఐక్యంగా ఉద్యమించాలని మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ అన్నెబోయిన బిక్షపతి, తెలంగాణ మత్స్యకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగెల రమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పెద్దమ్మ దేవవాలయ ప్రాంగణంలో మండలంలో ఉన్న అన్ని మత్స్యకార సొసైటీ సభ్యులచే మండల సదస్సు నాయిని రామస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి వారు హాజరై మాట్లాడుతూ మత్స్యకారులంతా తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. మత్స్యకారులంతా చైతన్యవంతమై రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అర్హులైన మత్స్యకారులకు ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువ వికాసం, తదితర సమస్యల పరిష్కారం కోసం తీర్మాణాలను సదస్సు ఆమోదించిందన్నారు. ముదిరాజ్ మత్స్యకార్మిక సంఘం నాయకులు చౌనబోయిన సోమనర్సయ్య, నరసయ్య, రామచంద్రు, వెంకటయ్య, బుచ్చయ్య, నరసయ్య, రాజు, కృష్ణ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/జనగామ టౌన్:** సే నో టు డ్రగ్స్, సే నోటు బెట్టింగ్ అనే నినాదంతో జనగామ జిల్లాలో ఎర్త్ ఫౌండేసన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఈనెల 30వ తేదీ నుండి స్థానిక ప్రెస్టన్ గ్రౌండ్‌లో నిర్వహించడం జరుగుతుందని ఫౌండేషన్ డైరక్టర్ మంగళంపల్లి రాజు తెలిపారు. శనివారం వారు మండలంలోని చౌడారంలో టోర్నమెంట్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో యువజన నాయకుడు కర్ణాకర్, పంచాయితి సెక్రటరి రాజు, యువత, ఫౌండేషన్ కో ఆర్డినేటర్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## 28 నుంచి పోలీస్ ప్రజాభరోసా వాలీబాల్ టోర్నమెంట్

### ఎస్‌పి కిరణ్ ఖరే



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పలిమెల మండలంలో భూపాలపల్లి పోలీస్ ప్రజా భరోసా, అంతరా సరిహద్దు జిల్లాల వాలీబాల్ టోర్నమెంట్ ను ఈనెల 28, నుంచి 30 నిర్వహించనున్నట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాలీబాల్ టోర్నమెంట్ లో భూపాలపల్లి, ములుగు, బీజాపూర్ (సిజి), గడ్చిరోలి (ఎంహెచ్), జిల్లాలకు చెందిన ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనవచ్చని, విజేతలకు మొదటి బహుమతి 25000 / , రెండవ బహుమతి 15000 / , మూడవ బహుమతి 10000 / మరియు ట్రోఫీలు బహుకరించనున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్లో ఎలాంటి ఎంట్రీ ఫీజు అవసరం లేదనీ, క్రీడాకారులకి భోజన వసతితో పాటు దూరప్రాంతాల నుండి వచ్చే వారికి వసతి సౌకర్యం ఉంటుందని, ఆసక్తిగల గల క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొనాలని, మరిన్ని వివరాల కోసం 917396147071, 917306907549 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఎస్పి వెల్లడించారు.

## శ్రీను హత్య కేసులో నిందితుడు అరెస్ట్




**ప్రజాపక్షం/ కొడకండ్ల/ పాలకుర్తి:** కొడకండ్ల మండలంలోని రేగులతండాకు చెందిన శ్రీను హత్య కేసులో నిందితుడు జయరాంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీను తన భార్య పిల్లలతో కలిసి రేగులగడ్డ తండాలో నివసిస్తున్నాడని నిందితుడు జయరాం అతను భార్యపిల్లలతో కలిసి గత 20 సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం హన్మకొండలోని రెడ్డి కాలనీలో ఉండేవాడన్నారు. మృతుడు శ్రీను నిందితుడు జయరాం ఇల్లు పక్కనే ఉండడం వల్ల శ్రీనుకు సంబంధించిన ఎద్దులను జయరాం ఇంటి వెనుకాల దారిలో కట్టివేస్తూ ఉండడం వలన ఇద్దరి మధ్య తగాదాలు ఏర్పడినట్లు తెలిపారు. పెంట నా స్థలంలో పారపోస్తున్నాడని ఎన్నిసార్లు చెప్పినా వినలేదని మనసులో పెట్టుకుని ఈనెల 20న శ్రీనును చంపడానికి రేగులతండా చేరుకుని అదేరాత్రి శ్రీనును విచక్షణా రహితంగా దాడిచేసి పారిపోయాడన్నారు. నేరస్థుడు గతంలో రెండు సార్లు జైలుకెళ్లి వచ్చాడన్నారు. మృతుడు శ్రీను కొడుకు వెంకన్న ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ పర్యవేక్షణలో వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య ఆధ్వర్యంలో హత్యకేసును చేధించినట్లు ఆయన తెలిపారు. నిందితుడు నారబోయిన గూడెం వద్ద దొరికినట్లు చెప్పారు. నేరస్థుడు హత్యకు ఉపయోగించిన ఆటోను, కత్తిని సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు. కొడకండ్ల ఎస్ఐ సీహెచ్ రాజు, హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, కానిస్టేబుల్ కె వెంకటేష్, ఎండీ ఇమ్రాన్, రఘుపతి, అశోక్, అరుణ్, శ్రీకాం త్, సాల్మన్, తదితరులున్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ సదస్సు విజయవంతం చేయాలి

### జాతీయ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్



**ప్రజాపక్షం/ తొర్రూరు :** ఈ నెల 29న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వీఆర్ఎన్ గార్డెన్‌లో నిర్వహించే రాజ్యాంగ రక్షణ సదస్సును విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు చిట్టిమల్ల మహేశ్ కోరారు. శనివారం మండలంలోని గోపాలగిరి, చీకటాయపాలెం గ్రామాల్లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో అంబేద్కర్ అంబేద్కరీజంపై జరిగే దాడిని ఎదుర్కోవాలని అన్నారు. రాజ్యాంగ రక్షణే అంతిమ లక్ష్యంగా పని చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలో మాల మహానాడు ఉద్యమకారులు, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాజ్యాంగ రక్షణ సదస్సు నిర్వహించడం జరుగుతుందని, దేశంలో ప్రాథమిక హక్కులను తూట్లు పొడిచి అస్థిరతకు బాటలు వేస్తున్నారని తెలిపారు. సామాజిక ఉద్యమకారులు, శాసనమండలి సభ్యులు డాక్టర్ అద్దంకి దయాకర్, ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, పార్లమెంట్ సభ్యులు బలరాంనాయక్, ప్రజాకవి జయరాజు, టీజీవో నేత హరికోట్ల రవి హాజరవుతున్నారని చెప్పారు. ప్రతీ ఒక్కరూ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ నాయకులు ఎనమాల రాజేశ్, యనమల శ్రీనివాస్, బూర్గుల ప్రశాంతి, యాకమధు, సంద్ర రాములు, శ్రీనివాస్, మనోజ్, అంజయ్య పాల్గొన్నరు.

## మాజీ మంత్రి హరీష్‌రావుకు ఘన స్వాగతం



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** బిఆర్‌ఎస్ రజతోత్సవ సభ నేపధ్యంలో వరంగల్‌కు వెళ్తున్న హరీష్‌రావుకు జనగామలో స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. శనివారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు బిఆర్‌ఎస్ నాయకులు హరీష్‌రావుకు స్వాగతం పలికి పరిచయం చేసుకున్నారు. అనంతరం ఎంఎల్‌ఎ క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో హరీష్‌రావు మాట్లాడారు. వరంగల్ సభకు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం నుండి ప్రజల్ని అధిక సంఖ్యలో తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు గద్దల నర్సింగరావు, బక్క నాగరాజు, ఎర్రొళ్ల శ్రీనివాస్, బాల్నె సిద్దిలింగం తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ములుగు మండలం జగ్గన్నపేట గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ కార్యకర్త పెద్దకాసు రాజన్న అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబాన్ని ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, సీనియర్ బిఆర్‌ఎస్ నాయకులు పోరిక గోవింద్ నాయక్ శనివారం సందర్శించి మృతుడి పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ సానికొమ్ము ఆదిరెడ్డి, మాజీ సర్పంచ్ మద్దిసంపత్,అజ్మీర ధరంసింగ్,బైకానిఓదెలు,తదితరులుపాల్గొన్నారు.

## హక్కుల సాధన కోసం పోరాటం చేయాలి

### ముదిరాజ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు దారం యువరాజు



**ప్రజాపక్షం/ నర్సంపేట :** ముదిరాజ్‌ల హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరు పోరాటం చేయాలని ముదిరాజ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు దారం యువరాజు అన్నారు. ముదిరాజ్ ఆత్మ గౌరవ పాదయాత్ర లో భాగంగా 8 వ రోజు రాజుపేటపేట నుండి ప్రారంభం అయ్యి నర్సంపేట ముగిసింది. అనంతరం సమాజ్ జెండాను ఆయన ఆవిష్కరించి ప్రసంగించారు. ముదిరాజ్ ల ఐక్యత కోసం, యువత భవిష్యత్తు కోసం బిసిడి నుండి బిసి ఏలోకి మార్చాలన్నారు. హక్కుల సాధన కోసం మేము ఎంతకైనా పోరాటం చేస్తామని తెలిపారు. ముదిరాజ్ కార్పొరేషన్ కి సంవత్సరానికి 1000 కోట్లు నిధులు కేటాయించాలని 75శాతం సబ్సిడీ సంక్షేమ పథకాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమం లో నర్సంపేట డివిజన్ అధ్యక్షులు జింకల కొమ్ములు, కేసరి వెంకటేశ్వర్లు, మోటం రవి, నూనె నర్సయ్య, ధోనీ చేరలు,నరేష్ , మురళి కిరణ్, నర్సింగ్ ,నాగరాజు, తదితరులుపాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన :కలెక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం / నర్సంపేట:** అర్హులైన ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులు ఆదేశించారు. శనివారం వరంగల్ జిల్లా నర్సంపేట మునిసిపల్ పరిధిలో, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా కొనసాగుతున్న రెండో దఫా గృహాల నిర్మాణాల కోసం లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియను పరిశీలించారు. ఇళ్ల నమోదు చేసిన సమాచారాన్ని (డేటా), భౌతికం గా పరిశీలించారు. ఇళ్ల కేటాయింపుకు అర్హులేనా కదా అన్న విషయాన్ని డేటా ఆధారం గా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు నిర్వహిస్తున్న సర్వే విధానాన్ని పరిశీలించారు. ప్రభుత్వ నిబంధల మేరకు అర్హుల గుర్తింపు అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతో జరగాలన్నారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదించిన ప్రతి 200 ఇండ్లకు నియమించిన ప్రత్యేక అధికారి జాగ్రతతో ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని అన్నారు. ఇందిరమ్మ కమిటీలు అందించిన జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటే మంజూరు చేసే జాబితా నుంచి తొలగించాలని అధికారులకు సూచించారు. ఈనెల 30 వరకు అర్హతల పరిశీలన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. భూమి విస్తీర్ణం 60 గజాలకు మించకూడదని అన్నారు. గతంలో బేస్మెంట్, పిల్లర్స్ కట్టిన వారు ఇందిరమ్మ పథకానికి అర్హులుకారనే విషయాన్ని గుర్తించాలనీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం నకు ఎంపికైనవారు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుండి ప్రొసీడింగ్స్ అందిన తర్వాతే నూతన ఇండ్ల నిర్మాణానికి ముగ్గులు పోసుకుని ప్రారంభించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ రామిరెడ్డి, హోసింగ్ ప్రాజెక్ట్ అధికారి గణపతి, నర్సంపేట మునిసిపల్ కమిషనర్ జోనా, ప్రత్యేక అధికారులు, వార్డ్ ఆఫీసర్లు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయండి

### మాజీ ఎమ్మెల్యే రాజయ్య



**ప్రజాపక్షం / వేలేరు :** తెలంగాణరాష్ట్ర సాధనకోసం చావునోట్లోదాకా వెల్లి తెంలగాణ రాష్ట్రాన్ని సాధించి అనేక రకాల సంక్షేమపథకాలను ప్రవేషపెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన బిఆర్ఎస్ పార్టీ 25 వసంతాల రజతోత్సవ వేడుకలు నేడు వరంగల్ జిల్లాలో జరుగుతున్న భారీబహిరంగసభను విజయవంతంచేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీఎంఎల్ఏ డా,టి.రాజయ్య బిఆర్ఎస్ శ్రేణులకు పిలుపినిచ్చారు.శనివారం వేలేరు మండలంలోని గుండ్లసాగర్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ మండల ఇంచార్జ్ ఇట్టబోయిన భూపతిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅథిధిగా హాజరై బిఆర్ఎస్ పార్టీ జెండాను అవిష్కరించి మాట్లాడారు.స్వరాష్ట్రసాధనకోసం ఎన్నో ఏల్లుగా ఎంతోమంది పోరాడి ప్రాణత్యాగాలు చేస్తుంటే చలించిన కెసిఆర్ నాడు టిఆర్ఎస్ పార్టీని ఆవిర్భావం చేసి తెలంగాణ వచ్చుడో కెసిఆర్ సచ్చుడో అనేనినాదంతో ఆమరణ నిరాహారదీక్షను చేపట్టి కేంద్రప్రభుత్వం మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రాన్నిఅభివృద్ధి చేసిన ఘనత కెసిఆర్‌కే దక్కుతోందని అన్నారు,ఇటీవలే జరిగిన ఎంఎల్ఏ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ నుండి స్టేషన్‌ఘన్‌పూర్ ఎంఎల్‌ఏగా కడియం శ్రీహరి గెలిచి తన కూతురు రాజకీయ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని స్వార్ధబుద్ధితో బిఆరెస్ పార్టీని వదిలి కాంగ్రేస్‌లో చేరిన ఆయన తక్షణమే ఎంఎల్ఏ పదవికి రాజీనామచేయాలని కోరుతు నేడు వరంగల్‌లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలను విజవంతం చేయాలని కోరారు.కార్యక్రమంలో గ్రామమాజీసర్పంచ్ గాదె ధర్మారెడ్డి,మాజీకోఆప్షన్‌సభ్యుడు జానీ,కొయ్యడ మహెందర్,ఎన్ఆర్ఐ గాదె దేవేందర్‌రెడ్డి,గోవింద సురేష్,పోలు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఇమ్యునైజేషన్‌ను వేగవంతం చేయాలి

### డిప్యూటీ మాస్ మిడియా అధికారి అనిల్ కుమార్



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ఇమ్యూనైజేషన్‌ను వేగవంతంగా చేయాలని డిప్యూటీ మాస్ మిడియా అధికారి ఈదురు అనిల్ కుమార్ అన్నారు. వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు ఆదేశాలతో వరంగల్ లోని ఏనుమాముల ఆరోగ్య ఉప కేంద్రం, పైడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాచ్ అప్ ప్రోగ్రాంలో పర్యటించి ఇమ్యూనైజేషన్ సెషన్‌ను ఆయన పర్యవేక్షించినారు. అనంతరము ఇమ్యూనైజేషన్ వ్యాక్సిన్లు తీసుకోవడం వలన క్షయ, పోలియో, కామెర్లు, కంటసర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతము, కామెర్లు, మెదడువాపు, న్యుమోనియా, మీజిల్స్, రూబెల్లా, జ్వరము, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, తీవ్ర నీళ్ల విరోచనాలు, కడుపునొప్పి, అందత్వ నివారణ మొదలగు వ్యాధులు రాకుండా ఉంటాయని వివరించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 16 సంవత్సరాల వయసు వరకు వయసుకు తగ్గట్టుగా వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించి బిడ్డకు ఎలాంటి వ్యాధులకు గురి కాకుండా చేయాలన్నారు. ఈ వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కలిగి తమ పిల్లల ఆరోగ్యం కొరకు వైద్య ఆరోగ్యశాఖ అందించి వ్యాధి నిరోధక టీకాల పట్టిక రూపంలో ఉన్న ప్రతి వ్యాక్సిన్ ఇప్పించాలని కోరారు.ఈకార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

## అధికారాన్ని అడ్డుపెట్టుకోని భూకబ్జాలు

### గంట రవికుమార్




**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** ఉద్యమం పేరు చెప్పి పదేళ్లు అధికారం అనుభవించారే తప్పా... బిఆర్ఎస్ చేసిన పని శూన్యమని వరంగల్ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు గంట రవికుమార్ విమర్శించారు. వరంగల్ జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారాన్ని అడ్డుపెట్టుకొని భూకబ్జాలు చేశారు తప్పా... అభివృద్ధి చేయలేదని, వరంగల్‌కు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. అందుకే వరంగల్ నగరంలో సభ పెడితే ఫెయిల్ అవుతుందని కరీంనగర్, సిద్దిపేట ప్రాంతాలకు మద్యలో పెట్టుకుంటున్నారని, గొప్పలు కొట్టే పిట్టలదొర మళ్లీ వస్తున్నాడని, ఓరుగల్లు ప్రజలు తస్మాత్ జాగ్రత్త అన్నారు. ఎల్కతుర్తిలో సభ పెట్టి చలో వరంగల్ అని పిలుపునియ్యడం సిగ్గుచేటన్నారు. వరంగల్‌కు మాస్టర్ ప్లాన్ అమలుచేయకుండా పదేండ్లు అభివృద్ధిని అడ్డుకొని 50 ఏళ్లు నగరాన్ని వెనక్కి నెట్టిన నీచపు చరిత్ర బిఆర్ఎస్ పార్టీదన్నారు. ప్రతి ఏడాది వరంగల్ కు 300 కోట్లు ఇస్తామని ప్రజలను మోసం చేసిన పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని, 2014 సంవత్సరంలో మడికొండలో జరిగిన సభలో మీరే కదా ఏడాదిలోపు డబుల్ బెడ్ రూమ్ లు కట్టించి యాటపోతు కోసి, కల్లు గుడాలతో గృహప్రవేశాలు చేస్తామన్నది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల దీన్ దయాల్, గడల కుమార్, కోశాధికారి కూచన క్రాంతికుమార్, అధికార ప్రతినిధులు ఆడెపు వెంకటేష్, సాగర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, బిజెపి శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, బిజెపి నాయకులు రామిని సుమన్, ముంద్రాతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతిపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి 2025 చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు.ఈ నెల 28 వ తేదీన మండలకేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 10 గంటలకు నిర్వహించే భూ భారతి చట్టంపై అవగామన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్,అడిషనల్ కలెక్టర్‌లతో పాటు సబ్ కలెక్టర్ హాజరై అవగాహన కల్పిస్తారని తెలిపారు. మండలంలోని మండల స్థాయి,గ్రామ స్థాయి మాజీ ప్రజా ప్రతినిధులు,అన్ని గ్రామాల రైతులు ప్రజలు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/నెక్కొండ:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అప్పలావుపేట గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నువ్వు నేను జిల్లా ప్రతిష్టాత్మంగా ప్రారంభించిన ఓడిసీఎంఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు సొంటిరెడ్డి, రంజిత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్మి,మద్దతు ధరతో పాటు, క్వింటాల్కు 500 రూపాయలు బోనస్ పొందాలని అన్నారు. దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బక్కి. అశోక్, టౌన్ ప్రెసిడెంట్ పెండ్యాల హరి ప్రసాద్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మ రెడ్డి, సుధాకర్ రెడ్డి, అప్పలావు పేట మాజీ ఉప సర్పంచ్ ఊడుగుల అశోక్, ఉపాధ్యక్షుడు యాసం హరికృష్ణ, మాజీ వార్డ్ మెంబర్లు బోల్ల కుమార్, వద్దె వెంకటేశ్వర్లు, బీరం రమేష్, ఆడేపు శ్రీనివాస్ రైతులు తిప్పని సాంబయ్య, భీరం రమేష్, నల్ల అశోక్, కాసు శ్రీధర్ రాజు, బానోతు వెంకన్న, మాలి హన్మంతు, గుద్దేటి రవి, నల్లపు మల్లేష్, యాసం నర్సయ్య, మంద శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## అభిమానాన్ని ఎవరు కోలమానం చేయలేరు



**ప్రజాపక్షం/నెక్కొండ:** అభిమానంను ఎవరు కొలమానం చేయలేరని నిరూపించిన వ్యక్తి శ్రీరాముడికి ఆంజనేయుడు అలాగే ఆ పరంపరలోనే సినిమా హీరోలు, హీరోయిన్లు, క్రికెట్ స్టార్లకు, రాజకీయ నాయకులకు, అభిమానులు కో కోళ్ళలు, అందులో భాగంగా గులాబీ జెండాకు కేసీఆర్ ను విపరీతంగా అభిమానించే వ్యక్తి మానుకోట జిల్లా కేసముద్రం మండలం వెంకటగిరి పరిధిలోని చంద్రు తండకు చెందిన భూక్య గంగయ్య నాయక్ 70 సంవత్సరాల వృద్ధ వయసులో ఈ నెల 27న జరిగే ఎలక తూర్తి బహిరంగ సభకు పాదయాత్రగా తన స్వగ్రామం నుండి గులాబీ జెండాను భుజాన వేసుకొని మోస్తూ వెళ్లాడు మార్గమధ్యలో నెక్కొండలో భారత రాష్ట్ర సమితి నాయకుడు మారం రాము గంగయ్య నాయక్‌ని సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ పిఏసిఎస్ మాజీ చైర్మన్ కొమ్మ రెడ్డి రవీందర్ రెడ్డి, ఈదునూరి వెంకన్న, కారింగుల సురేష్, పొనకంటి స్వామి, కందిక రాజు, కందిక అశోక్, కాయిత చంద్రశేఖర్, నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి నాయకుడు న్యాయవాది కొమ్ము రమేష్ యాదవ్, మండల భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు సంఘుని సూరయ్య, మాజీ ఎంపీపీ జాటోత్ రమేష్ నాయక్, గాదభద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రైతుకు గిట్టుబాటు ధర కొనుగోలు కేంద్రాల్లోనే లభ్యం



**ప్రజాపక్షం/నెక్కొండ:** రైతుకు గిట్టుబాటు ధర ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను లభ్యమవుతుందని నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం లోని భాగ్యలక్ష్మి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించిన సందర్భంగా రైతులు మధ్య దళాలను నాని మోసపోకుండా మార్కెట్లో అమ్ముకోవాలని ఆయన అన్నారు. ఈ కొనుగోలు కేంద్ర ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా టిపిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, నెక్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, రామలింగేశ్వర ఆలయ చైర్మన్ కొమ్మా రెడ్డి సుధాకర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, మార్కెట్ కార్యదర్శి కృష్ణ మీనన్, వ్యవసాయ విస్తరణ అధికారి వసంత, వెలుగు సిసి రవీందర్, వివో సునీత కొనుగోలు కేంద్ర సంఘ సభ్యులు వసంత ,సరిత, తదితరులు పాల్గొన్నారు.

# నిధుల వినియోగంపై ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టాలి

ప్రజాపక్షం/గజ్వేల్: తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వినియోగంపై దళిత అభివృద్ధి శాఖ సమీక్ష జరపాలని గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి జీవి సూర్యకిరణ్, అంబేద్కర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు అస శ్రీరాములు, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ లు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులు సరైన పద్ధతిలో వినియోగిస్తున్నారా? లేదా అనే అంశాన్ని కమిషన్ పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. గతంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఇతర పనులకు మళ్ళించినట్లు గుర్తు చేశారు. రాజ్యాంగ హక్కుగా ప్రతి దళిత వాడ , ప్రతి చెంచుగూడెం, ప్రతి లంబాడి తండా, ఆదివాసి గూడలకు మౌలిక వసతుల కల్పనకు సంబంధిత నిధులు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సబ్ ప్లాన్ నిధుల పైన సరైన పర్యవేక్షణ లేని కారణంగా చాలాసార్లు కేటాయించిన నిధులు ఖర్చు కావడం లేదని, ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. విద్యాపరంగా హాస్టల్లో మెరుగైన వసతులు ఏర్పాటు చేయటానికి ఇంకా అదనంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఇప్పటికే చాలా హాస్టల్లలో బాత్రూంలు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మర్చిపోవద్దని తెలిపారు. సాధ్యమైనంతవరకు విద్యకు సంబంధించిన అంశాలతో పాటు మౌలిక సదుపాయాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి మండల స్థాయిలో విజిలెన్స్ మానిటర్ కమిటీలు తప్పనిసరి సమావేశం అయ్యేటట్లు చూడాలని, సమావేశంలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడానికి కమిషన్ ఆదేశించాలని కోరారు. వీటితోపాటు ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీపై చర్చించాలని, అంబేద్కర్ అభయ హస్తం పథకం మార్గదర్శకాల విడుదల, ఎస్సీ కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్ హస్తళ్ళు, గురుకులాలలో కనీస వసతుల కల్పన, హైదరాబాద పబ్లిక్ స్కూల్ లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ప్రవేశానికి నొటిపికేషన్ విడుదల, హస్టళ్ళ మూసివేత, పుస్తకాల పంపిణి, పెండింగ్ బకాయిల విడుదల, బెస్ట్ అవలేబుల్ పథకం నిధుల విడుదల, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలు, బాధితులకు నష్టపరిహారం, పునరావాస కల్పన అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వివరించారు.



## ఏహెచ్ఎస్ ఉపాధ్యాయులకు కృత్రిమ మేధపై శిక్షణ

ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి: మహబూబాబాద్ జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు విద్యారంగంలో కృత్రిమ మేధ(ఏఐ)పై ఈనెల 28నుండి మే 30వరకూ శిక్షణ నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ప్రకటన విడుదల చేసినట్లు మహబూబాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిడి దేశీరామ్ తెలిపారు. జిల్లాలోని 360మంది ఉపాధ్యాయులు, 109మంది సిఆర్టిలకు దిద్యారంగంలో కృత్రిమ మేధ పాత్రపై జూమ్/వెబెక్స్ ఆన్లైన్ వేదికల ద్వారా అవగాహన తరగతులను నిర్వహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో మొత్తం 469 మంది ఉపాధ్యాయులను 15బ్యాచులుగా విభజించారని, ఒక్కోరోజు ఒక్కో బ్యాచ్కు 6సెషన్ల చొప్పున ఉదయం 10గంటల నుండి సాయంత్రం 4.45వరకూ జూబ్/వెబెక్స్ ఆన్లైన్ వేదికల ద్వారా కృత్రిమ మేధపై అవగాహన తరగతులు ఉంటాయని డిడి తెలిపారు.

## బిఆర్ఎస్,బిజెపి రాష్ట్ర అధ్యక్షుడినిగా బిసిలనే నియమించాలి

ప్రజాపక్షం/జనగామ టౌన్: బీఆర్ఎస్, బీజేపీ పార్టీల రాష్ట్ర అధ్యక్షులుగా బీసీలను నియమించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దూడల సిద్దయ్య గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఆర్అండ్బీ గెస్ట్ హౌస్లో బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు జాయ మల్లేష్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ పార్లమెంట్లో ఆమోదం పొందేలా బీజేపి, బీఆర్ఎస్ పార్టీలు కృషి చేయాలన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్, బీజేపీ పార్టీల వైఖరిని స్పష్టం చేయాలని, బీసీల పక్షాన నిలబడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ నామాల శ్రీనివాస్గౌడ్, రవీందర్, రాములు, పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ సభకు తరలి రావాలి

ప్రజాపక్షం/ఆత్మకూరు : ఆదివారం ఎల్కతుర్తి ల జరుగుతున్న బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆత్మకూరు మండలం బిఆర్ఎస్ నాయకులు పొగాకుల సంతోష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆత్మకూరు మండల కేంద్రంలో విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ రజతోత్సవ సభకు అన్ని గ్రామాల నుండి జనాలు స్వచ్ఛందంగా బయలు దేరి రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనలో విసుగు చెందిన తెలంగాణ ప్రజలు మళ్ళీ కేసిఆర్ పాలనే కావాలి అని కోరుకుంటున్నారు అని సంతోష్ గౌడ్ అన్నారు. ఈ సమావేశంలో ప్రవీణ్ రెడ్డి, రాజేందర్ గౌడ్, సదానందం, రమేష్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు మంద ల తిరుపతి రెడ్డి, కోడూరి రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులపై ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాపక్షం/రామాయంపేట: రామాయంపేట పట్టణంలో నిర్మించనున్న రోడ్డు విస్తరణ పనులపై శనివారం మహంకాళీ దేవాలయం ఆవరణలో ప్రజాప్రతినిదులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా పట్టణంలో నుండి వెళ్లే రహదారి శిథిలావస్థకు చేరి ప్రయాణికులకు నరకయాతనంగా మారింది. ప్రభుత్వాలు మారిన పట్టణ స్థితిగతులను పట్టించుకోకపోవదంతో అభివృద్ధి కుంటుపడింది. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్రావు కృషి మేరకు టియుఎఫ్ఐడి నిదులతో అంతర్గత రోడ్డు పనులకు మోక్షం కలిగింది. అందులో భాగంగా స్థానిక మజీద్ నుండి ఇందిరాగాంధీ విగ్రహం వరకు రోడ్డు విస్తరణకు పనులు చేయాలని నిర్ణయించి అభిప్రాయ సేకరణ చేపట్టడం జరిగింది. వర్తక, వ్యాపారులు, పట్టణ ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్థలాలు, ఇండ్లు, దుకాణాలు కోల్పోతున్న బాదితులు తమను ఆదుకోవాలని కోరారు. అభివృద్ధిని అడ్డుకుంటే నిదులు వెనక్కు వెళ్లిపోతాయని మళ్లీ ఎప్పుడు వస్తాయో..రావో తెలియదు కాబట్టి ప్రతి ఒక్కరు రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని స్థానిక నాయకులు చౌదరి సుప్రబాత్రావు, సరాపు యాదగిరి, ఏసుగూరి రమేష్రెడ్డి, దేమె యాదగిరిలు కోరారు. ఈకార్యక్రమంలో పట్టణ ప్రజలతో పాటు వ్యాపారులు, కుల సంఘాల నాయకులు, అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.



## వెంకటేశ్వర క్షేత్రంలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/గజ్వేల్: గజ్వేల్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర క్షేత్రంలో శనివారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారిని దర్శించుకోగా, వేద పండితులు శేషం శ్రీనివాసా చార్యులు నేతృత్వంలో అభివృద్ధి కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు, ఆశీస్సులు అందజేసి శేష వస్త్రంతో నర్సారెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాయకులు గుంటుకు శ్రీనివాస్, కరుణాకర్ రెడ్డి, నర్సింహారెడ్డి, శివారెడ్డి, గుంటుకు మల్లేశం, గాడిపల్లి శ్రీనివాస్, జంగం రమేష్ గౌడ్, ఉడెం శ్రీనివాస్ రెడ్డి, నేత నాగరాజు, ఎడెల్లి శ్రీనివాస్, నరేష్, బాబు రావు తదితరులు పాల్గొన్నారు.



## ఎల్కతుర్తి సభను విజయవంతం చేయండి

ప్రజాపక్షం/శివ్వంపేట : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్రావు నాయకత్వంలో జరిగే బిఆర్ఎస్ వజ్రోత్సవ మహాసభ విజయవంతం చేయాలని శివ్వంపేట బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణాగౌడ్ తెలిపారు. శివంపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 40 గ్రామాల నుండి ఎల్కతుర్తి సభకు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వేలాదిగా నాయకులు కార్యకర్తలు బి ఆర్ఎస్ అభిమానులు తరలిరావాలని, ప్రత్యేక తెలంగాణ సాధించిన కేసీఆర్ ఆవిర్భావమై 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ వజ్రోత్సవ సభ జరుగుతుందని ఆయన అన్నారు. నేడు అన్ని గ్రామాల్లో పార్టీ జెండాలు ఎగరవేసి శివంపేటకు చేరుకోవాలని కేసీఆర్ సభ కోసం యావత్తు తెలంగాణ ప్రజలందరూ ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ గౌడ్ గ్రామ కమిటీ అధ్యక్షులు లక్ష్మీనరసయ్య ,మాజీ సర్పంచులు బాలమని నరేందర్ ,అనూష అశోక్ గౌడ్, చిగుళ్లపల్లి శ్రీనివాస్గుప్తా, నువ్వుల దశరథ, వంజరి కొండల్, ఏనుగు కృష్ణారెడ్డి ,సారా శేఖర్ గౌడ్, నజిరుద్దీన్, కొత్తపేట వెంకటేష్ గౌడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## వర్గల్ క్షేత్రంలో.. వైభవంగా శని త్రయోదశి మహోత్సవం

ప్రజాపక్షం/గజ్వేల్: వర్గల్ క్షేత్రంలో... శనిత్రయోదశి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ, యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు శ్రీ శనైశ్చరుడికి తైలాభిషేకం చేసి మహోత్సవానికి అంకురార్పణ చేశారు. కాగా కుంభం, మీనం, మేషం, ధనుస్సు, సింహ రాశుల వారు క్షేత్రానికి పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారికి తిల, తైలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే శ్రీ విద్యాధరి, శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ చంద్రమౌళీశ్వర, శ్రీ సుబ్రహ్మణ్య, శ్రీ కళ్యాణ వెంకటేశ్వర, శ్రీ స్వయంభూ క్షేత్రాలను భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా క్షేత్రానికి తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేశారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాపక్షం/నిజాంపేట్: నిజాంపేట మండల పరిధిలో బచ్చురాజుపల్లి గ్రామానికి చెందిన కాళ్ళ రాజు తండ్రి శివాలు అనారోగ్య కారణాలవల్ల కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స చేసుకోవడం జరిగింది. అందుకుగాను స్థానిక ఎమ్మెల్యే మైనపల్లి రోహిత్ రావు సహకారం తో 24 వేల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గ్రామ కాంగ్రెస్ నాయకులు చేతుల మీదుగా అందజేయడం జరిగింది. గ్రామ యువజన నాయకుడు వినోద్ ఎమ్మెల్యే రోహిత్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, స్వామి, సుధా మల్లేశం కురుమ మల్లేశం, టీ.మల్లేశం, ఉపేందర్, రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకులు ఆస్తులు పెంచుకోవడానికే... ప్రజల కోసం పనిచేయలేదు..

ప్రజాపక్షం/శివ్వంపేట : బిఆర్ఎస్ నాయకులు తమ ఆస్తులను పెంచుకోవడానికి కానీ ప్రజల కోసం ఎప్పుడు పని చేయలేదని మండల సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పులిమామిడి నవీన్ గుప్తా అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాలనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం ఎన్నికల హామీలలో భాగంగా ప్రకటించిన ఇందిరమ్మ గృహాలను దశలవారీగా మంజూరి చేస్తుందని దాంట్లో భాగంగానే నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో శివ్వంపేట మండలానికి 382 ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక అసలైన అర్హులను గుర్తించి పార్టీలకతీతంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. గత పది సంవత్సరాలు బీఆర్ఎస్ పాలనలో గ్రామాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని ప్రకటించి ఒక్క గృహం కూడా మంజూరు చేయని ప్రభుత్వం అప్పటి కేసీఆర్ ప్రభుత్వం, అప్పుడు కేసీఆర్ బిఆర్ఎస్ నాయకులు కడుపు నింపుకోవడానికి వారి ఆస్తులు పెంచుకోవడానికి పనిచేశారు తప్ప ప్రజల కోసం ఏ ఒక్కరోజు కూడా పని చేసిన దాఖలాలు లేవని ఆయన ఆరోపించారు.

# పాత నేరస్తులపై నిఘా ఉంచాలి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సిపి శ్వేత శుక్రవారం సందర్శించారు. పరిసరాలను పరీక్షించి , పోలీసు అధికారులు, సిబ్బందితో ఇంట్రాక్టు సెషన్ నిర్వహించి సిబ్బందికి ఏవైన సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. ఈసందర్భంగా సిపి శ్వేత మాట్లాడుతూ ఫిర్యాదు దారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. రౌడీలు,కేడీలు.పాత నేరస్తులపై నిరంతర నిఘా ఉంచి వారి కదలికలను గమనించాలన్నారు. రాత్రి పెట్రోలింగ్ అధికారులు పాత నేరస్తులను తనిఖీ చేయాలన్నారు. విధి నిర్వహణలో రోల్ క్లారిటీ,గోల్ క్లారిటీ ప్రతిఒక్కరికి తెలిసి ఉండాలన్నారు. ప్రజల రక్షణకు ఏళ్ల వేళలా అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. సైబర్ నేరాలలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు,సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి క్రైమ్ రేటును తగ్గించాలన్నారు. పోలీసుస్టేషన్‌ను పరిశుభ్రతతో పచ్చదనంతో ఆహ్లాదరకరమైన వాతావరణంలో ఉంచాలని సూచించారు. పోలీసు అధికారులకు, సిబ్బందికి ఏవైన సమస్యలుంటే హెచ్‌ఆర్‌ఎంఎస్ గ్రీవెన్స్ సెల్ ద్వారా పంపించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈకార్యక్రమంలో సిఐ బిక్షపతి పాల్గొన్నారు.

## ప్రజా రక్షణకు ఏళ్ల వేళలా అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలి

**ప్రజాపక్షం/సిద్ధిపేటప్రతినిధి:** ప్రజా రక్షణకు ఏళ్ల వేళలా అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ జిల్లా పోలీసు అధికారులకు సూచించారు. సిద్ధపేట జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యలయం పరిదిలోని పెండింగ్ కేసులపై శనివారం సిద్దిపేట డివిజన్ అధికారులతో సిపి సమీక్ష సమావేషంను నిర్వహించారు. ఈసందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ 2023 నుంచి 2025 నేటి వరకు గల అండర్ ఇన్వస్టిగేషన్ కేసులపై ఏసిపి సీఐలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ మాట్లాడుతూ... ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులలో 60 రోజుల్లో ఇన్వస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాకలు చేయాలని అన్నారు. సిసిటిఎస్ఎస్ వర్షన్ 2 నూతన టెక్నాలజీ గురించి సోలీస్ అధికారులకు, సిబ్బందికి అవగాహనుండాలని సిపి తెలిపారు. ఫిర్యాదు దారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. రౌడీలు,కేడీలు.పాత నేరస్తులపై నిరంతర నిఘా ఉంచి వారి కదలికలను గమనించాలన్నారు. రాత్రి పెట్రోలింగ్ అధికారులు పాత నేరస్తులను తనిఖీ చేయాలన్నారు. విధి నిర్వహణలో రోల్ క్లారిటీ,గోల్ క్లారిటీ ప్రతిఒక్కరికి తెలిసి ఉండాలన్నారు. ప్రజల రక్షణకు ఏళ్ల వేళలా అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. సైబర్ నేరాలలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి క్రైమ్ రేటును తగ్గించాలన్నారు. పోలీసుస్టేషన్‌ను పరిశుభ్రతతో పచ్చదనంతో ఆహ్లాదరకరమైన వాతావరణంలో ఉంచాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## నేటి బిఆర్ఎస్ సభకు తరలి రావాలి

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆదివారం ఎల్కతుర్తి ల జరుగుతున్న బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆత్మకూరు మండలం బిఆర్ఎస్ నాయకులు పొగాకుల సంతోష్ గౌడ్ పిలుపు నిచ్చారు. ఆత్మకూరు మండల కేంద్రంలో విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ రజతోత్సవ సభకు అన్ని గ్రామాల నుండి జనాలు స్వచ్ఛందంగా బయలు దేరి రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనలో విసుగు చెందిన తెలంగాణ ప్రజలు మళ్ళీ కేసిర్ పాలనే కావాలి అని కోరుకుంటున్నారు అని సంతోష్ గౌడ్ అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఏఎంసి డైరెక్టర్ పైడి వార్డ్ మెంబెర్స్ ప్రవీణ్ రెడ్డి, బయగాని రాజేందర్ గౌడ్, బి సదానందం,పిఎసిఎస్ డైరెక్టర్ కోడూరి రమేష్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు మంద ల తిరుపతి రెడ్డి, కోడూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలి

**ప్రజాపక్షం/కాటారం:** గర్భిణీలు పౌష్టికాహారం పై అవగాహన కలిగి ఉండాలని అంగన్వాడీ టీచర్ వేమునూరి విజయ లక్ష్మి అన్నారు.శనివారం మండలంలోని గుండ్రాత్ పల్లి అంగన్వాడి కేంద్రంలో పోషన్ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గర్భిణీలు పౌష్టికాహారం పై అవగాహన కలిగి ఎప్పటికప్పుడు పౌష్టికాహారం తీసుకోవాలని దీంతో తల్లి బడ్డ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. యుక్త వయసు బాలికలు రక్తహీనత లేకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.అందుబాటులో ఉండే పండ్లు, కూరగాయలు,చిరు ధాన్యాలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, రెండు సంవత్సరాలు నిండిన పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యనందించడంతో శారీరక మానసిక అభివృద్ధి పెరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం విజయ, ఆయాలు ,గర్భిణీలు, తల్లులు పాల్గొన్నారు.

## ఈనెల 29న జాబ్‌మేళా

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** ఈనెల 29న ముతూట్ మైక్రోఫిన్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి పి సాహితి ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు సీనియర్ అసిస్టెంట్ జె గీత, 79954 30401 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

## పిల్లల్లో ఉన్న కళలను వెలికి తీయడానికే సమ్మర్ క్యాంపు



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** మండలంలోని ఇటిక్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపును మండల విధ్యాధికారి మాధవరెడ్డి శనివారం సందర్శించారు. సమ్మర్ క్యాంపులో చదువుతో పాటు చిత్రలేఖనం,కంప్యూటర్ విద్య, ఇండోర్ గేమ్స్ నేర్పడంపై ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో అంతర్లీనంగా ఉన్న కళలను వెలికి తీయడానికి సమ్మర్ క్యాంపు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. భవిష్యత్ అంత కంప్యూటర్‌తో ముడిపడి ఉంటున్నందున ప్రాథమిక దశ నుండే విద్యార్థులకు కంప్యూటర్ పాఠాలు నేర్పుతున్నారని తెలిపారు. ఇది గమనించి గ్రామీణ ప్రాంతాల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపి వారి భవిష్యత్‌కు పునాధులు వేయాలని కోరారు. అనంతరం విద్యార్థులు వేసిన చిత్రలేఖనంను పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నేతి శంకర్,ఉపాధ్యాయులు నరేందర్,వాలంటీర్ అనురాధ పాల్గొన్నారు.

## వాచ్‌డాగ్ కమిటీలు బాధ్యతయుతంగా పని చేయాలి



**ప్రజాపక్షం/సిద్ధిపేట ప్రతినిధి:** వాతావరణ మార్పులు, తరిగిపోతున్న నీటి వనరుల నేపథ్యంలో జిల్లాలో నీటి కొరత ఏర్పడకుండా జిల్లా స్థాయి వాచ్‌డాగ్ కమిటీలు పని చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. శనివారం ఐడిఓసిలోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ జిల్లా స్థాయి వాచ్‌డాగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. నీటి వనరులు తరిగిపోతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలకు నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా కమిటీ పని చేయాలని సూచించారు. జిల్లాలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పై సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాడానికి ముందుగానే 300 చదరపు మీటర్ల కంటే ఎక్కువ ప్లాట్ ఏరియా ఉన్నఅన్ని భవనాలు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రకర్ కలిగి ఉండాలని, అదేవిధంగా 10వేల చదరపు మీటర్ల, అంతకంటే ఎక్కువ విస్తీరణంలో ఉన్న భారీ భవనాలో 100 ఎక్కువ యూనిట్లు ఉన్న గ్రూప్ హౌస్‌లకు వ్యర్థ జలాలు రీసైక్లింగ్ ప్లాంట్‌లను కలిగిఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డిపిఒ దేవకీ దేవి, డిఆర్డివో జయదేవ్, మిషన్ భగీరథ అధికారులు, మున్సిపాలిటీ అధికారులు తదితరులు ఉన్నారు.

## సమీకృత కార్యాలయం ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** ఒక మండలం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ కార్యాలయాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. కాని నూతనంగా ఏర్పాటు చేసి సంవత్సరాలు గడుస్తున్నా... ధూల్మిట్ట మండలకేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం తప్ప మిగితా ప్రభుత్వ కార్యాలయాల పాలన ఉమ్మడి మద్దూరు మండలంలోనే కొనసాగిస్తున్నారు. దింతో మండల ప్రజలుకు పాలన ఇబ్బందులు తప్పడం లేదు. మండలం ఏర్పాటు చేసిన తమ ప్రతి పనికి పాత మండలంకు వెళ్లాల్సిన దుస్థితినెలకొందని ప్రజలు వాపోతున్నారు. ధూల్మిట్ట మండల కేంద్రలో ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ భూమి లేకపోవడంతో, నూతనంగా ఏర్పాటు చేసిన ధూల్మిట్ట మండలకేంద్రంలో ప్రజలకు అందుబాటులో పాలన సమస్యలు పరిష్కరించాలన్నే ఉద్దేశంతో మండలానికి కావల్సిన అన్ని కార్యాలయాలు ఒకే చోట నిర్మించేందుకు స్థలం కావాలని అప్పటి ప్రభుత్వం అన్న వెంటనే గ్రామస్తులు కొందరు స్వచ్ఛందంగా స్థలా దానం చేశారు.ఈ సమస్యలపై ధూల్మిట్ట నూతన మండలంలో పూర్తిస్థాయిలో ఎంపిడివో కార్యాలయం ఏర్పాటుతో పాటుగా తహసీల్దార్ అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండే విధంగా సమికృత కార్యలయం నిర్మాణం చేయాలని కోరుతూ, శుక్రవారం ధూల్మిట మండల కేంద్రంలోని రైతువేదికలో భూభారతి చట్టం అవగాహన కార్యక్రమం వచ్చిన జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హబీద్ తో పాటుగా ఆర్డీవో రామ్మూర్తి, స్థానిక ధూల్మిట్ట తహశీల్దార్ సింహాచలం మధుసూదన్ మండల అధికారుల సమక్షంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరికి మండలం నాయకులతో పాటుగా గ్రామస్తులు వినతి పత్రం అందించారు. దినితో పాటుగా గతంలో 4కోట్ల 50 లక్షలతో సాంక్షన్ అయిన మండల కేంద్రంలోని (నాలుగు లైన్ల )రోడ్డు వెడల్పు ఏర్పాటుతో పాటుగా, మండలానికి వచ్చిన కెజిబివి స్కూల్ కొమురవెల్లిలో నిర్వహిస్తున్న పాఠశాలను మండలంలోకి తీసుక రావాలని కలెక్టను వినతి పత్రంతో కోరారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మార్కెట్ కమీటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్ రెడ్డి, గిరి కొండల్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు చెప్యాల అనిల్, మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎండి. రఫీ, పాల్గోన్నారు.

## బిఆర్ఎస్ శ్రేణులకు ఘన స్వాగతం పలికిన నేతలు

**ప్రజాపక్షం /హుస్నాబాద్ :** అదివారం ఎల్కతుర్తిలోల జరగనున్న భారతరాష్ట్ర సమితి భారీ భహిరంగ సభకు వెలుతున్న సిద్దిపేట జిల్లా చెందిన బిఆర్ ఎస్ నాయకులు గజ్వేల్ లో శుక్రవారం ఉదయం 11 గంటలకు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు జెండ ఊపి ర్యాలిని ప్రారంబించారు. బిఆర్ ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకులు రెడ్డి యాదగిరి నాయకత్వంలో గజేల్వలో బయలు దేరిన బిఆర్ ఎస్ శ్రేనులు శనివారం హుస్నాబాద్ కు చేరుకున్న సందర్భంగా వారికి హుస్నాబాద్ పట్టణ నాయకులు మున్సిపల్ మాజీ చైర్మెన్ అకుల రజిత, వైస్ చైర్మెన్ అనితరెడ్డి,అక్కన్నపేట ఎంపిపి లక్ష్మి బీలునాయక్, జడ్పిటీసీ మంగ,మరియు మార్కెట్ కమీటి చైర్మెన్ ఎడబొయిన తిరుపతిరెడ్డి,తో పాటు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. దాదాపు వేయ్యి మందితో బయలు దేరిన బిఆర్ ఎస్ నాయకులు శనివారం పట్టణంలో శుభం గార్డెన్‌లో వారికి విడిది ఏర్పటు చేశారు.

## 29న వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో మన పండుగలు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఈ నెల 29న వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మన పండుగలు పేరుతో కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్ మొహమ్మద్ సిరాజుద్దీన్, అధ్యక్షులు ఆచార్య సురేష్ లాల్, ప్రధాన కార్యదర్శి శ్రీపాద సుధాకర్ రావు, కోశాధికారి డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది, రంజాన్, మహావీర్ జయంతి,శ్రీరామ నవమి, అంబేద్కర్ జయంతి,గుడ్ ఫ్రైడే,ఈస్టర్ ఫెస్టివల్ తదితర పండుగలను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో మత సామరస్యానికి ప్రతీకగా మన పండుగలు పేరుతో కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగ వస్తుందని అందులో భాగంగా ఈ నెల 29 సాయంత్రం 5.30 గంటలకు హనుమకొండ నయీంనగర్ లోని వాగ్దేవి డిగ్రీ కళాశాల ఆవరణలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
భిన్న మతాల వంటకాలతో పీస్ ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సమాజ సేవ చేస్తున్న అయిదుగురికి శాంతి మిత్ర బిరుదుల ప్రదానం ఉంటుందని ఇందులో హిందూ, ముస్లిం, సిక్కు, క్రైస్తవులకు ఒక్కొక్కరికి బిరుదు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులు, సామాజికవేత్తలు, మేధావులు, విద్యావేత్తలు, కళాకారులు, తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.